క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ములుగు రూరల్: విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతు కారణంగా నేడు(శనివారం) ములుగు, పత్తిపల్లి, కాశిందేవిపేట సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ బానోత్ రవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ములుగు, పత్తిపల్లి సబ్ స్టేషన్‌ల పరిధిలో 09 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కాశిందేవిపేట సబ్ స్టేషన్ పరిధిలో 12 గంటల నుంచి 2గంటల వరకు అంతరాయం కలుగుతుందని తెలిపా రు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ధ్యాన యోగా

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని కొమురం భీం స్టేడియంలో నేడు(శనివారం) ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి 7 గంటలవరకు ధ్యాన యోగా కార్యక్రమం ఉంటుందని యోగా గురువు యర్రంకని రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఈ యోగా ధ్యాన దినోత్సవాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బ్యూటీషియన్ కోర్సుతో ఉపాధి



ఏటూరునాగారం: బ్యూటీషియన్ కోర్సుతో ఉపాధి లభిస్తోందని ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ ఉచిత శిక్షకురాలు శివ సరిత అన్నారు. మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఎస్‌బీఐ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రెనింగ్ ఇనిస్ట్యూట్ ద్వారా 35 మంది మహిళలకు బ్యూటిషన్ కోర్సులో నెల రోజులపాటు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం మాట్లాడుతూ.. ఈ కోర్సు పూర్తి చేసుకున్న తర్వాత సర్టిఫికెట్స్ అందజేయడంతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, మహిళలు పాల్గొన్నారు.

పారదర్శకత పాటించాలి



ములుగు: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించేలా చూడాలని బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కోకిల మహేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం అడిషనల్ కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీకి వినతిపత్రం అందించారు. ఎంపిక చేసే క్రమంలో నిబంధనలు పాటించేవిధంగా అధికారులకు సూచనలు చేయాలని అన్నారు. ఆయన వెంట నాయకులు అన్న తిరుపతి, గన్నోర్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాగుల పంపిణీ



గోవిందరావుపేట: మండల కేంద్రంలోని బాలికల జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల విద్యార్థునులకు బిర్లా శక్తి సిమెంట్ వారు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. రూ.60 వేల విలువ చేసే స్కూల్ బ్యాగులు బిర్లా శక్తి సిమెంట్ డిస్ట్రిబ్యూటర్ నిరంజన్ రావు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొంది దివాకర్ కృతజ్ఞతలు తెలిపారు.అన్నమేరి, రేణుక, సుగుణాదేవి, వనజ, అంజలి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గొత్తికోయలకు దుప్పట్లు..



వెంకటాపురం(ఎం): మండలంలోని నందిపాడు గొత్తికోయ కుటుంబాలకు హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొంపెల్లి రమణారెడ్డి జ్ఞాపకార్థం అతడి కుమారుడు, ఫౌండేషన్ కన్వీనర్ కొంపెల్లి ప్రమోద్‌రెడ్డి దుప్పట్లు పంపిణీ చేశారు. 30 కుటుంబాలకు బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందించారు. సభ్యులు సాయితేజ, రఘు, శ్రీకాంత్, ప్రవీణ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి



ఎస్ఎస్‌తాడ్వాయి: పాఠశాలల్లోని విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ రేగ కేశవరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ పాఠశాలలోని విద్యార్థినులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ పుష్పనీల ఉపాధ్యాయులు పోరిక శంకర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'ముసలయ్య'ను పట్టించుకోరా..?

- లక్నవరం సరస్సు కట్టపై గుట్టమీదిముసలయ్య ఆలయం
- రెండు సంవత్సరాలకు ఒకసారి జాతర నిర్వహణ
- అభివృద్ధి చేస్తే పర్యాటకంగా వెలుగులోకి..



చెట్లకొమ్మల మధ్య గుడి సూచిక బోర్డు



ముసలయ్య గద్దె చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు

గోవిందరావుపేట: మండలంలోని లక్నరవం సరస్సుపై ముసలయ్య ఆలయం ఉంది. ముసలయ్య కోరిక మేరకే కాకతీయ రాజులు లక్నవరం సరస్సు నిర్మించినట్లు స్థానికులు తెలుపుతున్నారు. ఆ సరస్సు నిర్మాణానికి కారణమైన ముసలయ్య చరిత్ర రాష్ట్ర ప్రజలకు తెలువకపోవడం, ఆయన గుడి అక్కడ ఉందని అసలు పర్యాటకులు గుర్తించకపోవడం బాధాకరం. కాగా, రెండేళ్లకోసారి మేడారం జాతర సమయంలో ఇక్కడ ముసలయ్య జాతరను ఆదివాసీలు ఘనంగా నిర్వహిస్తారు. లక్నవరం సరస్సు కట్టపై వాహనాల పార్కిగ్ పక్కనే గుట్టమీది ముసలయ్య ఆలయం ఉన్న అధికారులు సరైన ఏర్పాట్లు చేయకపోడంతో పర్యాటకులు సందర్శించుకోవడం లేదు. గద్దె వద్ద పిచ్చి చెట్లు పెరిగాయి. ఆలయం వద్ద సరైన ఏర్పా ట్లు లేకపోవడం ఆలయం ఉన్న విషయం కూడా అక్కడికి వెళ్లే భక్తులకు తెలియడం లేదు. కనీసం సూచిక బోర్డులు కూడా సరిగా లేని పరిస్థితి. ఆల యం వద్ద ఏర్పాట్లు చేస్తే నిత్యం లక్కవరం సరస్సు సందర్శనకు వచ్చే భక్తులతో ముసలయ్య ఆలయం కిటకిటలాడుతుందని స్థానికులు వాపోతున్నారు. ఆలయం నిర్మించి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. సరస్సుతో పాటు ఆలయం కూడా ఉంటే పర్యటకులతో పాటు భక్తులు కూడా అధిక సంఖ్యలో వస్తారని తెలుపుతున్నారు. ప్రజా ప్రతినిధులు కాని, అధికారులు గానీ ఆలయం అభివృద్ధి దృష్టి పెట్టడం లేదు. స్థానిక మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకోని ఆలయానికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

గుడి నిర్మాణం చేపట్టాలి



ప్రతీ రోజు వేలా ది మంది పర్యాటకులు లక్నవరం చెరువును చూడటానికి వస్తుంటారు. కానీ ముసలయ్య ను దర్శనం చేసుకోకుండానే వెళ్తుంటారు. ప్రతీ పర్యాటకుడు ముసలయ్య దగ్గరికి వచ్చి దర్శనం చేసుకున్న తర్వాతనే చెరువును సందర్శించేలా క్యూ లైన్ ఏర్పాటు చేయాలి. అలాగే ప్రభుత్వం చొరవ తీసుకోని గుడి నిర్మాణం చేపట్టాలి.

– తవిటి నారాయణ, ముసలయ్య జాతర పూజారి

పదేళ్లుగా ప్రచారం చేస్తున్నా..



నేను 10 సంవత్సరాలుగా లక్నవరం సరస్సుపై గుట్టమీది ముసలయ్యని దర్శించండి అని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ, హైదరాబాద్ జిల్లాలో తిరుగుతూ గోడల మీద, బస్టాండ్ ప్రాంగణాలలో రాస్తూ ప్రచారం చేస్తున్నా. లక్నవరం సరస్సును చూడటానికి రోజు వేల మంది పర్యాటకులు వస్తుంటారు. వచ్చిన వారు ముసలయ్య గుడిలో దర్శించుకుంటే గుడి అభివృద్ధి అవుతుంది.

– గుండమీద వెంకటేశ్వర్లు, రాయినిగూడెం

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి యమున

- వైద్యాధికారి యమున

మంగపేట: విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి చన్నపెల్లి యమున సూచించారు. చుంచుపల్లిలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక హెల్త్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి యమున విద్యార్థినులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆహారం తీసుకునే ముందు తీసుకున్న అనంతరం చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. శీతాకాలంలో జలుబు, దగ్గు రాకుండా ఉండేందుకు విద్యార్థులకు కాచి వడపోచి చల్లార్చిన నీటిని తాగించాలని హాస్టల్ వార్డెన్, హెచ్‌ఎంలకు సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ శైలజ, హెచ్‌వీ నాగమణి, ఏఎన్ఎం రమాదేవి ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొత్త వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దు



సోదాలు చేస్తున్న ఎస్సై తాజొద్దీన్

ఏటూరునాగారం: కొత్త వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని ఎస్సై తాజుద్దీన్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ క్రాస్ రోడ్డు పరిసర ప్రాంతాలలో శుక్రవారం ఎస్సై ఆధ్వర్యంలో ఇంటింటా తనిఖీలను చేపట్టారు. సిబ్బందితో కలిసి ఇళ్లను సోదాలు చేశారు. ఇంటి యజమానులు, అద్దెకు ఉంటున్న వారి వివరాలు ధ్రువపత్రాలు క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ చుట్టూ ఉన్న ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమానితులిని అదుపులోకి తీసుకోని విచారించి వదిలేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. తెలియని వారికి ఇళ్లు అద్దెకు ఇవ్వవద్దన్నారు. అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసు వారికి సమాచారం అందించాలన్నారు.

ఎంపీలపై దాడి చేయడం సరికాదు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ములుగు రూరల్: పార్లమెంట్‌లో సహచర ఎంపీలపై దాడి చేయడం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. శుక్రవారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజు ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీ హోదాలో ఉంది శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన రాహుల్‌గాంధీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. భవిష్యత్‌లో ప్రధాన మంత్రి కావాలని కలలు కనడం రాహుల్ గాంధీ అవివేకానికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్ రెడ్డి, రవింద్రాచారి, విశ్వనాథ రవిరెడ్డి, కుమార్, హేమాద్రి, వెంకటేశ్, హరిశ్, కృష్ణమూర్తి, భానుప్రసాద్, విక్రాంత్, వెంకట్‌రెడ్డి, సతీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇళ్ల సర్వే

ఏటూరునాగారం: ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శంగా ఉంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సర్వేను పార్టీ నాయకులు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చిటమట రఘు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం గ్రామంలో ఉన్న నిరుపేదలైనా అర్హులకు ఏ రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు వస్తాయన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు అయుబ్ ఖాన్, లాలయ్య, ఎల్లయ్య, కర్ల అరుణ తదితరుల పాల్గొన్నారు.

చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన బొగ్గుల రామకృష్ణ చెట్టుమీద నుంచి పడి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో అతడి పేరుపై వచ్చిన రూ.83వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును తల్లిదండ్రులు బొగ్గుల సావిత్రి, నర్సయ్యలకు అందజేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ అయూబ్ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, కార్యదర్శి గుడ్ల దేవేందర్, మండల ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్, శివాలయం ఆలయ చైర్మన్ మడుగూరి ప్రసాద్, మాజీ వార్డు సభ్యుడు రంజిత్ కుమార్, పడిదాల హనుమంతు, టౌన్ బీసీ సెల్ అధ్యక్షుడు వల్స తిరుపతి, జిల్లా యూత్ కార్యదర్శి ఎండీ గౌస్, ఇర్సవడ్ల కిరణ్ కుమార్ ఉన్నారు.

'చట్టాలను అమలు చేయడం లేదు'

వాజేడు/వెంకటాపురం(కె): ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ చట్టాలను అధికారులు అమలు చేయడం లేదని తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు చింత సోమరాజు, ఎట్టి రాజబాబు ఆరోపించారు. శుక్రవారం వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. పెసా, 1/70 చట్టాలను పక్కాగా అమలు చేయాలన్నారు. అక్రమ నిర్మాణాలతో పాటు బహుళ అంతస్తులను గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా నిర్మిస్తున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పెసా గ్రామ సభల ద్వారానే ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్ర మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలి



ములుగు రూరల్: అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



మంగపేట: నిరసన తెలుపుతున్న కాంగ్రెస్, దళిత, ప్రజాసంఘాల నాయకులు

కేంద్రమంత్రి అమిత్‌షా పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించారని, దీనిపై ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలంటూ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా వివిధ పార్టీల నాయకులు నిరసన తెలిపారు. అనంతరం అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అమిత్ షా అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు

– సాక్షి నెట్‌వర్క్



ఏటూరునాగారం: నిరసన తెలుపుతున్న నాయకులు



వాజేడు: అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



వెంకటాపురం(కె): నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

సర్వే వేగంగా పూర్తి చేయాలి



ఏటూరునాగారం: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రాజ్యలక్ష్మీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో, కోయగూడ ఎల్లాపురం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ సర్వేను ఆమె పరిశీలించారు. పేరు, అడ్రస్‌లు సరిగా నమోదు చేయాలన్నారు. సాంకేతిక సమస్యలు వస్తే వెంటనే సంప్రదించాలన్నారు. సర్వేలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు పేర్ల ఆధారంగా సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రమాదేవి, లక్ష్మీనారాయణ, సతీష్, ఈజీఎస్ ఏపీఓ చరణ్, సిబ్బంది సురేష్, రవి పాల్గొన్నారు.

అడవుల రక్షణ అందరి బాధ్యత



కొత్త టేకులగూడెంలో అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఎస్ఓ నారాయణ

వాజేడు: అడవుల రక్షణ అందరి బాధ్యత అని ఎఫ్ఎస్ఓలు నారాయణ, నాగమణి, రామ్మూర్తి అన్నారు. మండల పరిధిలోని కొత్తటేకులగూడెం, కృష్ణాపురం, మండపాక గ్రామాల్లో ప్రజలకు, సిబ్బందికి శుక్రవారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అడవిలోకి వెళ్లిన ప్రజలు చీపురు కోసే టప్పుడు, ఇప్ప పువ్వులు ఏరే టప్పుడు నిప్పు పెట్టవద్దన్నారు. అడవి జంతువులను వేటాడవద్దన్నారు. ఉచ్చులు, విద్యుత్ తీగెలు అమర్చి జంతువులను హతమార్చడం చట్టపరంగా నేరమన్నారు. వన్య ప్రాణాలను కాపాడుకోవడం బాధ్యత అని సూచించారు.

ఆటో కార్మికుల ముందస్తు అరెస్ట్



ఎస్ఎస్ తాడ్వాయి: అరెస్టు అయిన కార్మికులు



వాజేడులో..



వెంకటాపురం(కె)లో..

ఎస్ఎస్‌తాడ్వాయి: హైదరాబాద్‌లోని అసెంబ్లీ ముట్టడికి శుక్రవారం తరలివెళ్తున్నారనే సమాచారం పోలీసులు ముందస్తుగా మండలంలోని ఆటో కార్మికులను అరెస్టు చేశారు. సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల ఆటో కార్మికుల యూనియన్ నాయకులు శ్రీరాములు, చెవుగాని రఘుబాబు, పాండావుల లింగామూర్తి, ఠాకూర్ అశోక్‌సింగ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉచిత బస్సు ప్రయాణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వాజేడు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ఆటో కార్మికులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ చేసిన వారిలో చిరంజీవి, కేశవరావు, ప్రవీణ్, సారయ్య, సమ్మయ్య, రాజేష్ వరుణ్ తదితరులు ఉన్నారు.

వెంకటాపుర(కె): ప్రభుత్వం తమ సమస్యలను పట్టించు కోవడం లేదని వాటిని పరిష్కరించాలని ఆటో యూనియన్ నాయకుడు తాటిశెట్టి రాజన్న డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తుండా పోలీసులు ఆటో యూనియన్ నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

దాతల సాయం అభినందనీయం

- ఎంఈఓ పొదెం మేనక



బ్యాగులు ఆట వస్తువులు అందజేస్తున్న ఎంఈఓ

మంగపేట: నిరుపేద విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి సాయం చేయడం అభినందనీయం అని ఎంఈఓ పొదెం మేనక అన్నారు. మండలంలోని కొత్తూరుమొట్లగూడెం పంచాయతీ పరిధిలోని రేగులగూడెం ప్రాథమిక పాఠశాలలోని 35 మంది విద్యార్థులకు పలువురు దాతలు రూ.10,000 విలువైన స్కూలు బ్యాగులు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు ఆట వస్తువులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. రోడ్డు మార్గం లేనటువంటి దట్టమైన అటవీ ప్రాంతంలోని ఆదివాసీ గొత్తికోయ గిరిజన ఆవసా గ్రామమైన రేగులగూడెం పాఠశాలలో చదువుకుంటున్న నిరుపేద గొత్తికోయ గిరిజన విద్యార్థులకు దాతలు సాయం అందించారన్నారు. అలాగే హనుమకొండకు చెందిన శుభం ఈవెంట్ ఆర్గనైజర్ మంతెన మనోజ్ రెడ్డి అతడి కూతురు పుట్టిన రోజు సందర్భంగా రూ.5,000 విలువైన ఆట వస్తువులు, టీఎల్ఎం చార్ట్స్, మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన ఆచంట శ్రీనివాస్, రమేష్ వారి తండ్రి ఆచంట కృష్ణారావు జాపకార్థంగా రూ.5,000 విలువైన స్కూలుబ్యాగులు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాజు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రెడ్డి, క్రాంతి, ప్రవీణ, మాతంగి మధు, సతీష్, శ్రీధర్, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎస్ఎస్ తాడ్వాయి: సమ్మెకు మద్దతుగా నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



వెంకటాపురం(ఎం): నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

ఎస్ఎస్‌తాడ్వాయి: సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మండలంలోని ఉపాధ్యాయులు కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 13 రోజులుగా సమ్మె చేస్తున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు మద్దతుగా శుక్రవారం మండలంలోని కాటాపూర్, ఇందిరానగర్, నార్లాపూర్, ఎల్బాక, మేడారం గ్రామాల్లోని జెడ్పీ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన విరామం సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి ఎస్ఎస్ఏ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మె చేయడంతో విద్యాశాఖలో పనులు కుంటు పడుతున్నాయన్నారు.

ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

వెంకటాపురం(ఎం): సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండలంలోని నర్సాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎస్‌టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు మద్దతుగా నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఠాకూర్ మంజుల, కవిత, విమల, సాంబయ్య, యాకయ్య, ఉమతో పాటు తదితరులు పాల్గొన్నారు.